ఈడీ, సీబీఐ లేకపోతే బీజేపీకి 100 సీట్లు కూడా రావు!

ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 21: సీబీఐ, ఈడీ, ఐటీ సాయం లేకపోతే ప్రస్తుత ఎన్నికల్లో బీజేపీ గెలుచుకునే స్థానాలు 100 కూడా దాటవని ఆర్జేడీ నాయకుడు తేజస్వీ యాదవ్ అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఓట్లు దండుకోవడానికి ప్రతిపక్ష నాయకులపైకి కేంద్ర దర్యాప్తు సంస్థల్ని బీజేపీ ఉసిగొల్పుతున్నదని, మత రాజకీయాలకు పాల్పడుతున్నదని ఆరోపించారు. ఢిల్లీ సీఎం కేజ్రీవాల్, పశ్చిమ బెంగాల్ సీఎం మేనల్లుడు అభిషేక్ బెనర్జీ, గాంధీ, లాలూ కుటుంబ సభ్యులను కేంద్ర దర్యాప్తు సంస్థలు టార్గెట్ చేయటం ఉత్తరాదిన ఎన్నికల్లో ప్రచార అంశంగా మారింది.

ఎంపీలో నెగ్గేదెవరు?

మధ్యప్రదేశ్‌లో బీజేపీ- కాంగ్రెస్ హోరాహోరీ

- గత రెండు ఎన్నికల్లోనూ క్లీన్‌స్వీప్ చేసిన బీజేపీ
- ఈసారి కూడా అన్ని స్థానాలు దక్కించుకునేలా ఫోకస్
- బీజేపీని నిలువరించేందుకు కాంగ్రెస్ ప్రయత్నాలు
- రెండంకెల సీట్లు దక్కించుకునేలా వ్యూహాలు



భోపాల్, ఏప్రిల్ 21: దేశంలో బీజేపీ కంచుకోటగా చెప్పే రాష్ట్రాల్లో మధ్యప్రదేశ్ ముందు వరుసలో ఉంటుంది. 1999 నుంచి అన్ని లోక్‌సభ ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌పై బీజేపీ ఇక్కడ స్పష్టమైన ఆధిక్యత ప్రదర్శిస్తున్నది. 2004, 2009 ఎన్నికల్లో యూపీఏ అధికారంలోకి వచ్చినా మధ్యప్రదేశ్‌లో మాత్రం బీజేపీకే కాంగ్రెస్ కంటే ఎక్కువ సీట్లు వచ్చాయి. 2014 ఎన్నికల్లో ఏకంగా 29 స్థానాలకు 27, 2019లో 28 స్థానాలను దక్కించుకున్న కమలం పార్టీ దాదాపు క్లీన్‌స్వీప్ చేసేసింది. ఈసారి కూడా ఇవే ఫలితాలను రిపీట్ చేయాలని పట్టుదలగా ఉంది. ఐదు నెలల క్రితమే జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపు ఆ పార్టీకి మరింత ఉత్సాహాన్ని ఇచ్చింది. ఇక, బీజేపీని కంచుకోటలోనే నిలువరించాలని కాంగ్రెస్ ప్రయత్నిస్తున్నది. ఈసారి ఎలాగైనా రెండంకెల స్థానాలను సాధించుకొని పరువు నిలుపుకోవాలని తాపత్రయపడుతున్నది. ఇతర చిన్న పార్టీలు పోటీ చేస్తున్నప్పటికీ ప్రధాన పోటీ మాత్రం బీజేపీ – కాంగ్రెస్ మధ్యనే ఉన్నది. రెండు పార్టీలూ ఈసారి రాష్ట్రంలో కొత్త నాయకత్వంతో ఎన్నికల బరిలోకి దిగుతున్నాయి. నాలుగు దశల్లో ఇక్కడ ఎన్నికలు జరగనున్నాయి. ఇప్పటికే ఏప్రిల్ 19న మొదటి దశ పూర్తయ్యింది. ఏప్రిల్ 26, మే 7, మే 13న మిగతా దశల్లో ఎన్నికలు జరగనున్నాయి.

మోదీ చరిష్మాపైనే బీజేపీ ఆశలు

మధ్యప్రదేశ్‌లో బీజేపీ ఎక్కువగా ప్రధాని నరేంద్ర మోదీ చరిష్మానే నమ్ముకుంది. అయోధ్యలో రామమందిర నిర్మాణం, హిందూత్వ అంశం కూడా తమకు ఓట్లు రాలుస్తాయని బీజేపీ భావిస్తున్నది. ఇటీవలే జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లోనూ బీజేపీ గెలవడంతో, రాష్ట్రంలో, కేంద్రంలో ఒకే ప్రభుత్వం ఉండాలనే బీజేపీ డబుల్ ఇంజిన్ నినాదం కూడా ప్లస్ అవుతుందని లెక్కలు వేసుకుంటున్నది. అయితే, ఇంతకుముందు బీజేపీకి శివరాజ్ సింగ్ చౌహాన్ లాంటి రాష్ట్రస్థాయి నాయకుల ఇమేజ్ కూడా కలిసొచ్చింది. కానీ, ఈసారి ఆ పరిస్థితి కనిపించడం లేదు. కచ్చితంగా ముఖ్యమంత్రి అవుతారనుకున్న శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను తప్పించి జూనియర్ అయిన మోహన్ యాదవ్‌ను బీజేపీ హైకమాండ్ ముఖ్యమంత్రిని చేసింది. నరేంద్ర సింగ్ తోమర్, కైలాశ్ విజయ్‌వర్గీయ లాంటి సీనియర్ నాయకులను కూడా పక్కనపెట్టేసింది. ఇది లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి ప్రతికూలంగా మారవచ్చని అంచనా వేస్తున్నారు. అయితే, మోహన్ యాదవ్ ఓబీసీ కావడం వల్ల ఓబీసీ ఓట్లు పెరుగుతాయని బీజేపీ ఆశిస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వంపై అవినీతి ఆరోపణలు, నిరుద్యోగం, దళితులపై దాడులు వంటి అంశాలు సైతం బీజేపీకి ఇబ్బందిగా మారొచ్చు.

కాంగ్రెస్‌కు అసలైన సవాల్

మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ పరిస్థితి లోక్‌సభ ఎన్నికలకు, అసెంబ్లీ ఎన్నికలకు చాలా భిన్నంగా ఉంటున్నది. అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీకి దాదాపు 40 శాతానికి పైగా ఓట్లు వస్తున్నాయి. అయితే, లోక్‌సభ ఎన్నికలకు వచ్చేసరికి కాంగ్రెస్ ఓట్లు 30 – 35 శాతానికి పడిపోతున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటేసిన వారు కూడా లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి మళ్లుతున్నారు. 2018 చివర్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 40.89 శాతం ఓట్లు వస్తే లోక్‌సభ ఎన్నికల్లో 34.5 శాతం ఓట్లు మాత్రమే వచ్చాయి. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడిపోయినా 40.45 శాతం ఓట్లు సాధించింది. ఈ ఓట్లను లోక్‌సభ ఎన్నికల్లోనూ నిలుపుకోగలిగితే కమలం పార్టీ దూకుడుకు కాంగ్రెస్ కొంతవరకైనా అడ్డుకట్ట వేయగలదు. కానీ, ఈ పరిస్థితి ఉందని కచ్చితంగా చెప్పలేమని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇక, మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీ కమల్‌నాథ్, దిగ్విజయ్ సింగ్, సురేశ్ పచోరీ, అజయ్ సింగ్, అరుణ్ యాదవ్ వంటి సీనియర్ నేతలను పక్కనపెట్టి కొత్త నాయకత్వాన్ని తెరమీదకు తెచ్చింది. ఓబీసీ నేత జితు పట్వారీని పీసీసీ అధ్యక్షుడిగా, గిరిజన నేత ఉమాంగ్ సింఘార్‌ను ప్రతిపక్ష నేతను చేసింది. వీరి ద్వారా ఆ వర్గాల ఓట్లను ఆకర్షించవచ్చని కాంగ్రెస్ భావిస్తున్నది. అయితే, కమల్‌నాథ్ బీజేపీలోకి వెళ్తారనే ప్రచారం, నేతల మధ్య సమన్వయలోపం, అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమితో పార్టీ శ్రేణుల్లో నైరాశ్యం కాంగ్రెస్‌కు మైనస్ కావొచ్చు. కనీసం రెండంకెల సీట్లు గెలుచుకోవాలని కాంగ్రెస్ లక్ష్యంగా పెట్టుకున్నది. ముఖ్యంగా 2009లో గెలిచిన 12 సీట్లపై ఆ పార్టీ ప్రధానంగా ఫోకస్ చేసింది. మధ్యప్రదేశ్‌లోని వింధ్య, చంబల్ ప్రాంతాల్లో బీఎస్పీ చీల్చే ఓట్లు కాంగ్రెస్‌కు నష్టం చేసే అవకాశం ఉంది.

కమలం వైపే సర్వేలు

ఈసారి కూడా మధ్యప్రదేశ్‌లో కమలం పార్టీకే అనుకూల పరిస్థితులు ఉన్నాయని సర్వేలు చెప్తున్నాయి. దాదాపుగా అన్ని సర్వేలు బీజేపీ 20కి పైగా స్థానాలు గెలుస్తుందని అంచనా వేశాయి. అయితే, కాంగ్రెస్‌కు 40 శాతం వరకు ఓట్లు వస్తాయని చెప్తున్నాయి. ఈ లెక్కల ప్రకారం కాంగ్రెస్‌కు ఇంకొంత ఓట్ల శాతం పెరిగితే బీజేపీకి బలమైన పోటీ ఇచ్చే అవకాశం ఉంది. లేకపోతే మరోసారి మధ్యప్రదేశ్ బీజేపీ వైపే నిలిచే అవకాశం ఉంది.

చింద్వారా ఎవరిది?

2019 ఎన్నికల్లో మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ గెలిచిన ఏకైక స్థానం చింద్వారా. 2014లో గెలిచిన రెండుస్థానాల్లో ఇది ఒకటి. ఇది మాజీ ముఖ్యమంత్రి కమల్‌నాథ్‌కు కంచుకోట లాంటిది. ఇక్కడి నుంచి ఆయన తొమ్మిదిసార్లు లోక్‌సభకు ఎన్నికయ్యారు. ఒకసారి ఆయన భార్య అల్కా నాథ్ గెలిచారు. గత ఎన్నికల్లో ఆయన కుమారుడు నకుల్‌నాథ్ విజయం సాధించారు. గత 44 ఏండ్లలో 43 ఏండ్లు చింద్వారా స్థానం కమల్‌నాథ్ కుటుంబం చేతిలోనే ఉంది. ఇక్కడ క్రమంగా కాంగ్రెస్‌కు మెజారిటీ తగ్గుతూ వస్తున్నది. గత ఎన్నికల్లో కేవలం 37 వేల మెజారిటీతో నకుల్‌నాథ్ గట్టెక్కారు. ఈసారి కచ్చితంగా చింద్వారా సీటును గెలుచుకోవాలని పట్టుదలగా ఉన్న బీజేపీ వివేక్ సాహును బరిలోకి దింపింది. కాంగ్రెస్ తరపున మరోసారి నకుల్‌నాథ్ బరిలో నిలిచారు. వీరిద్దరి మధ్య హోరాహోరీ పోటీ నెలకొన్నది.

కాంగ్రెస్‌కు ఓటేస్తే దేశ సంపద ముస్లింలకు పంచేస్తుంది

- వారికే మొదటి హక్కు అని ఆ పార్టీ చెప్పింది
- తల్లులు, చెల్లెళ్ల మంగళసూత్రాలనూ వదలదు
- కాంగ్రెస్‌పై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర వ్యాఖ్యలు

జైపూర్, ఏప్రిల్ 21: లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కాంగ్రెస్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో అధికారంలోకి వస్తే, ప్రజల ఆస్తులు, భూమి, బంగారాన్ని ముస్లింలకు పంచేస్తుందని వ్యాఖ్యానించారు. ఆదివారం రాజస్థాన్‌లోని జాలోర్‌లో ఆయన ఎన్నికల ప్రచారసభలో మాట్లాడుతూ... 'ఇంతకుముందు వాళ్లు(కాంగ్రెస్) అధికారంలో ఉన్నప్పుడు దేశ సంపదలో మొదటి హక్కు ముస్లింలకే అని చెప్పారు. అంటే ఈ సంపద మొత్తాన్ని వారు ఎక్కువ మంది పిల్లలు ఉన్న వారికి, చొరబాటుదారులకు పంచేస్తారు. మీ కష్టార్జితాన్ని చొరబాటుదారులకు పంచేందుకు మీరు అంగీకరిస్తారా?' అని ప్రశ్నించారు. 'తల్లులు, చెల్లెళ్ల దగ్గర ఉన్న బంగారం లెక్క తీస్తామని కాంగ్రెస్ మ్యానిఫెస్టో చెప్తున్నది. ఈ సంపదను పంచేస్తారు. సంపదపై ముస్లింలకే మొదటి హక్కు ఉంటుందని మన్మోహన్ సింగ్ ప్రభుత్వం చెప్పింది. ఈ అర్బన్ నక్సల్స్ ఆలోచన నా తల్లులు, చెల్లెళ్ల మంగళసూత్రాలను కూడా వదలదు' అని మోదీ పేర్కొన్నారు. మోదీ చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ తప్పుబట్టింది. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో హిందూ, ముస్లిం అనే పదాలనే పొందుపర్చలేదని ఆ పార్టీ నేత పవన్ ఖేరా పేర్కొన్నారు.

పూర్ణియాపై పప్పూ పట్టు!

ఎన్డీఏ, ఇండియా కూటములకు గట్టి పోటీ ఇస్తున్న స్వతంత్ర అభ్యర్థి

ఓటర్లకు నమస్కరిస్తున్న పప్పు యాదవ్(ఫైల్)

పూర్ణియా, ఏప్రిల్ 21: రాజేష్ రంజన్ అలియాస్ పప్పూ యాదవ్.. ఈ పేరు ఈసారి బీహార్ లోక్‌సభ ఎన్నికల్లో ప్రముఖంగా వినిపిస్తున్నది. పూర్ణియా స్థానం నుంచి మూడుసార్లు ఎంపీగా గెలిచిన ఆయన ప్రస్తుతం స్వతంత్ర అభ్యర్థిగా అక్కడి నుంచి మరోసారి బరిలోకి దిగారు. ఎన్డీఏ, ఇండియా కూటములకు ఆయన గట్టి పోటీ ఇస్తున్నారని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు. తాను స్థాపించిన జన్ అధికార్ పార్టీని ఇటీవల ఆయన కాంగ్రెస్‌లో విలీనం చేశారు. అయితే కాంగ్రెస్ నుంచి టికెట్ ఆశించి భంగపడ్డ ఆయన స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. అయితే ఆయనపై ఇప్పటికీ కాంగ్రెస్ బహిష్కరణ వేటు వేయకపోవడం గమనార్హం. 'ప్రణామ్ పూర్ణియా' పేరుతో ఏడాదిగా పప్పూ యాదవ్ చేపడుతున్న ప్రచారం ఆయనకు మంచి పేరు తెచ్చిపెట్టిందని స్థానికులు చెప్తున్నారు. మోటార్ సైకిల్‌పై వాడవాడలా తిరుగుతూ ఆయన ఉత్సాహంగా ప్రచారం చేస్తున్నారు. అన్ని వర్గాల మద్దతుతో అగ్ర వర్ణాల బీజేపీని, ముస్లిం–యాదవ్ కాంబినేషన్‌ను నమ్ముకున్న ఇండియా కూటమిని మట్టి కరిపిస్తానని ధీమా వ్యక్తం చేస్తున్నారు. పప్పూ యాదవ్ ఎన్డీఏ ఏజెంట్ అని ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ ఆరోపిస్తున్నారు. ఆర్జేడీ నుంచి మాజీ మంత్రి బీమా భారతి పోటీలో ఉన్నారు.

ఉచితాలపై శ్వేతపత్రం విడుదల చేయాలి

కేంద్రాన్ని కోరిన ఆర్బీఐ మాజీ చీఫ్ సుబ్బారావు

హైదరాబాద్: ఓటర్లకు తాయిలాలు లేదా ఉచితాలపై రాజకీయ పార్టీల మధ్య ఏకాభిప్రాయం తేవడం కోసం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం ఓ శ్వేతపత్రాన్ని విడుదల చేయాలని భారతీయ రిజర్వు బ్యాంకు (ఆర్బీఐ) మాజీ గవర్నర్ డీ సుబ్బారావు అన్నారు. ఓ ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ, ఉచితాల విషయంలో రాజకీయ పార్టీలను కట్టడి చేయడం ఎలా? అనే అంశంపై సమగ్ర చర్చ జరగాలన్నారు. ఇటువంటి పథకాల వల్ల కలిగే లాభనష్టాల గురించి ప్రజలకు మరింత అవగాహన కలిగించాలని చెప్పారు.

ఎన్నికల్లో గెలవలేకే రాజ్యసభ బాట

సోనియాను ఎద్దేవా చేసిన మోదీ!

న్యూఢిల్లీ: ఎన్నికల బరిలో నిలిచి, గెలవలేని నేతలు రాజ్యసభ సభ్యులుగా రాజస్థాన్ నుంచి ఎన్నికవుతున్నారని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆరోపించారు. ''మీరు రాజస్థాన్ నుంచి మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌ను రాజ్యసభకు పంపించారు. ఆ తర్వాత ఆయన రాష్ట్రంలో కనిపించారా? ఇప్పుడు మళ్లీ రాష్ట్రం నుంచి రాజ్యసభకు ఆ పార్టీ నేత మరొకరు వెళ్లారు. ఎన్నికల్లో పోరాడి, గెలవలేనివారు రాజస్థాన్‌కు వస్తున్నారు'' అని ఎద్దేవా చేశారు. అయితే ఆయన సోనియా గాంధీ పేరును నేరుగా ప్రస్తావించలేదు.

జై భవానీ, హిందూ పదాలను తొలగించే ప్రసక్తే లేదు

ఈసీ నోటీసుపై ఉద్ధవ్ ఠాక్రే

ముంబై: తమ పార్టీ గీతం నుంచి జై భవానీ, హిందూ పదాలను తొలగించే ప్రసక్తే లేదని శివసేన (యూబీటీ) అధ్యక్షుడు ఉద్ధవ్ ఠాక్రే స్పష్టం చేశారు. ఈ పదాలను తొలగించాలంటూ తనకు ఎన్నికల సంఘం నోటీసులు పంపిందని, ఈసీ ఆజ్ఞలకు కట్టుబడబోమని తెలిపారు. ఆదివారం మీడియాతో మాట్లాడుతూ, 'ఈ పదాలను తొలగించడం మహారాష్ట్రకే అవమానం. కొత్త పార్టీ గుర్తు వెలుగుతున్న కాగడాను ప్రచారం చేసేందుకు ఈ గీతాన్ని రూపొందించా' అని చెప్పారు.

వయనాడ్‌లో రాహుల్‌కు ఎదురుదెబ్బ

బీజేపీలో చేరిన జిల్లా కీలక నేత

వయనాడ్ : వయనాడ్ నుంచి పోటీ చేస్తున్న కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి ఎదురుదెబ్బ తగిలింది. వయనాడ్ కాంగ్రెస్ కమిటీ జిల్లా కార్యదర్శి పీఎం సుధాకర్ ఆదివారం ఆ పార్టీకి రాజీనామా చేసి బీజేపీలో చేరారు. రాజీనామా అనంతరం ఆయన మాట్లాడుతూ ఒక జిల్లా నేతగా రాహుల్ గాంధీ తనకే అందుబాటులో ఉండరని, సామాన్యుడు ఎలా కలవగలడని ప్రశ్నించారు.

కాంగ్రెస్‌కు ఇండియా హాకీ మాజీ కెప్టెన్ రాజీనామా

భువనేశ్వర్: కాంగ్రెస్ పార్టీ తనను అవమానించిందని భారత హాకీ జట్టు మాజీ కెప్టెన్ ప్రబోధ్ టిర్కే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన ఎయిరిండియాలో ఉద్యోగం వదులుకుని గత సెప్టెంబరులో కాంగ్రెస్‌లో చేరారు. ఒడిశాలోని తల్సారా శాసనసభ నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు ఆయనకు ఆ పార్టీ ఈ నెల 2న టికెట్ ఇచ్చింది. కానీ ఈ నెల 14న ఆ పార్టీ విడుదల చేసిన రెండో జాబితాలో ఆయన పేరును తొలగించింది. అయితే ఈ మార్పు గురించి తనకు మాట మాత్రంగానైనా కాంగ్రెస్ పెద్దలు చెప్పలేదని ప్రబోధ్ ఆవేదన వ్యక్తం చేశారు.

కుమారస్వామికి అగ్నిపరీక్ష

- మండ్యలో రసవత్తర పోరు
- ఒక్కలిగల మద్దతు ఎవరికో?

బెంగళూరు, ఏప్రిల్ 21: కర్ణాటకలోని మండ్య నుంచి లోక్‌సభ బరిలో నిలిచిన మాజీ ముఖ్యమంత్రి కుమార స్వామికి ఈ ఎన్నిక అగ్ని పరీక్షగా మారింది. నియోజకవర్గం ఏర్పడినప్పటి నుంచి ఒక్క ఉప ఎన్నికలో తప్ప 13 సార్లు విజయం సాధించిన చరిత్ర కాంగ్రెస్‌ది. మాజీ ముఖ్యమంత్రిగా, జేడీ(ఎస్) నుంచి పటిష్టమైన వ్యక్తిగా కుమారస్వామి రంగంలో ఉండటంతో మండ్య లోక్‌సభ స్థానం అందరినీ ఆకర్షిస్తున్నది. రాజకీయంగా ఎంతో అనుభవమున్న ఆయన ఈసారి కాంగ్రెస్‌కు చెందిన కోటీశ్వరుడైన సివిల్ కాంట్రాక్టర్ వెంకటరమణి గౌడ అలియాస్ స్టార్ చంద్రుతో పోటీ పడుతున్నారు. ఎంతో కాలంగా ఈ ప్రాంత ప్రజలతో అనుబంధం ఉన్న కుమారస్వామికి 254 కోట్ల రూపాయల ఆస్తిపరుడైన వెంకటరమణిని ఎలా ఢీకొంటారన్నది ఆసక్తికరంగా మారింది. తాను రాజకీయాలకు కొత్త అయినప్పటికీ తాను మండ్య పుత్రుడినంటూ వెంకట రమణి ప్రచారం చేస్తున్నారు.

బీజేపీతో పొత్తు కలిసొస్తుందా?

ఈ నెల 26న ఎన్నికలు జరిగే మండ్య నియోజకవర్గం ప్రజలకు వ్యవసాయం ప్రధాన వృత్తి. పార్లమెంట్ నియోజకవర్గం ఏర్పడినప్పటి నుంచి ఒకసారి జరిగిన ఉప ఎన్నికలో ఎస్ఎం కృష్ణ ప్రజా సోషలిస్ట్ పార్టీ నుంచి ఎన్నికవ్వడం తప్ప 13 సార్లు ఇక్కడ కాంగ్రెస్ నెగ్గుతూ వచ్చింది. అయితే 2019 ఎన్నికల్లో మండ్య నుంచి నటి సుమలత అంబరీష్, బీజేపీ మద్దతుతో ఇండిపెండెంట్‌గా నెగ్గారు. తర్వాత ఆమె బీజేపీలో చేరినప్పటికీ, ఈ సారి ఎన్నికల్లో ఆమె పోటీకి దూరంగా ఉండటం, జేడీ(ఎస్)తో బీజేపీ పొత్తులో ఉండటంతో ఇక్కడ కుమారస్వామి, గౌడ మధ్య ముఖాముఖీ పోటీ ఏర్పడింది.

50 శాతం ఒక్కలిగలే

8 అసెంబ్లీ నియోజకవర్గాలున్న మండ్యలో గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఆరింటిని గెల్చుకుంది. 18 లక్షల మంది ఓటర్లున్న మండ్యలో 50 శాతం మంది ఒక్కలిగ సామాజిక వర్గం వారే ఉన్నారు. దీంతో వారు ఎవరివైపు మొగ్గుచూపుతారే ఆ పార్టీ వారే ఇక్కడ విజయం సాధిస్తారు. కాగా, దళితులు, ఓబీసీలు, మైనారిటీ వర్గాలకు కాంగ్రెస్ చేస్తున్న బలమైన వాగ్గానాల వల్ల వారు ఆ పార్టీ వైపు మొగ్గు చూపుతారేమోనని ఎన్డీఏ ఆందోళన చెందుతున్నది. ఇదే జరిగితే జేడీ(ఎస్), బీజేపీ కూటమికి నష్టం జరగడం ఖాయం. 90 శాతం వ్యవసాయం మీద ఆధారపడి ఉన్న ఈ ప్రాంత ప్రజలకు ప్రధాన నీటి వనరు కావేరీ నదే. కాబట్టి కావేరీ జలాల వివాదం కూడా ఈ ఎన్నికపై ప్రభావం చూపుతుంది. ఒక్కలిగలలో తన హోదాను పునరుద్ధరించాలనుకుంటున్న జేడీ(ఎస్) ఈ ఎన్నికలు అతి ముఖ్యమైనవిగా భావిస్తున్నది. దీంతో ఈ ఎన్నికల్లో ఎట్టి పరిస్థితుల్లో విజయం సాధించాలని కుమారస్వామి పట్టుదలగా ఉన్నారు.

జైలులో కేజ్రీవాల్ హత్యకు కుట్ర

ఢిల్లీ సీఎం సతీమణి సునీత ఆరోపణ

రాంచీ, ఏప్రిల్ 21: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ సతీమణి సునీత కేజ్రీవాల్ తీవ్ర ఆరోపణలు చేశారు. తీహార్ జైలులో ఉన్న తన భర్తను హత్య చేయడానికి కుట్ర జరుగుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం రాంచీలో జరిగిన ఇండియా కూటమి ర్యాలీలో ఆమె ప్రసంగిస్తూ, నేరం రుజువు కాకపోయినా కేజ్రీవాల్‌ను, జార్ఖండ్ మాజీ సీఎం హేమంత్ సొరేన్‌లను అరెస్ట్ చేయడం నియంతృత్వమని అన్నారు. 'అసలు నా భర్త చేసిన తప్పేంటి? మంచి విద్య, వైద్య సౌకర్యాలు కల్పించడమా?' అని ఆమె ప్రశ్నించారు. 'ఆయన మధుమేహ వ్యాధితో బాధపడుతున్నారు. చికిత్సలో భాగంగా గత 12 ఏండ్లుగా ప్రతిరోజు 50 యూనిట్ల ఇన్సులిన్ తీసుకుంటున్నారు. అయితే జైలులో ఆయనకు ఇన్సులిన్ మాత్రం ఇవ్వడం లేదు. వారు కేజ్రీవాల్‌ను చంపాలనుకుంటున్నారు' అని ఆమె పేర్కొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని విఫలం కానివ్వం: హేమంత్ సొరేన్

ప్రతిపక్షాల నేతృత్వంలోని ప్రభుత్వాలను కూల్చేందుకు బీజేపీ ప్రయత్నిస్తున్నదని, ప్రజాస్వామ్యాన్ని విఫలం కానివ్వరాదని జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సొరేన్ పిలుపునిచ్చారు. ప్రస్తుతం జైలులో ఉన్న హేమంత్ సోరెన్ పంపిన సందేశాన్ని ఆయన సతీమణి కల్పన సొరేన్ బహిరంగ సభలో చదివి వినిపించారు. ఈ సభలో ఇండియా కూటమిలోని 28 పార్టీల నేతలు పాల్గొన్నారు. కల్పన మాట్లాడుతూ, ప్రతిపక్షాల గొంతును నొక్కడం కోసం ఈడీ, సీబీఐ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు.

నన్ను, అభిషేక్‌ను బీజేపీ టార్గెట్ చేస్తున్నది

మాకు రక్షణ లేదు: మమత

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మరోసారి బీజేపీపై విరుచుకుపడ్డారు. తనకు, తన మేనల్లుడు, టీఎంసీ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీకి రక్షణ లేదన్నారు. తమను బీజేపీ టార్గెట్ చేస్తున్నదని ఆరోపించారు. కాషాయ పార్టీ కుట్రలకు తాము భయపడబోమని స్పష్టం చేశారు. టీఎంసీ నేతలకు, రాష్ట్ర ప్రజలకు వ్యతిరేకంగా జరుగుతున్న కుట్రలకు ప్రతి ఒక్కరూ రక్షణగా నిలవాలని పిలుపునిచ్చారు. బీజేపీ నేత సువేందు అధికారి శనివారం మాట్లాడుతూ.. సోమవారం పెద్ద విస్ఫోనం జరుగుతుందని, దానివల్ల టీఎంసీ, దాని అగ్ర నేతలు వణికిపోతారని వ్యాఖ్యానించారు.

శ్రీరాముడు అందరివాడు

నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా

రాంచీ, ఏప్రిల్ 21: భగవాన్ శ్రీరాముడు అందరివాడని, ఆయన కేవలం హిందువులకు మాత్రమే దేవుడు కాదని నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా అన్నారు. రాంచీలో ఆదివారం ఇండియా కూటమి ఆధ్వర్యంలో జరిగిన మహా ర్యాలీలో ఆయన ప్రసంగిస్తూ 'వారు రాముడిని అమ్మేస్తున్నారు. వారే అతడిని తీసుకు వచ్చినట్టు చెబుతున్నారు. వాస్తవానికి రాముడి గురించి వారికేం తెలియదు. ఆయన కేవలం హిందువులకే కాదు.. ప్రపంచమంతటికీ చెందిన భగవానుడు.' అని పరోక్షంగా బీజేపీని ఉద్దేశించి విమర్శలు చేశారు.

సూరత్ బరి నుంచి కాంగ్రెస్ ఔట్!

అభ్యర్థి నామినేషన్ తిరస్కరణ

సూరత్: సూరత్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి నీలేశ్ కుంభని దాఖలు చేసిన నామినేషన్ తిరస్కరణకు గురైంది. ఆయనకు ప్రత్యామ్నాయంగా సురేశ్ పడ్సల దాఖలు చేసిన నామినేషన్‌ను కూడా చెల్లనిదిగా ప్రకటించారు. కుంభని, పడ్సల సమర్పించిన నామినేషన్లపై ప్రతిపాదకుల సంతకాల్లో వ్యత్యాసాలు ఉన్నాయని గుర్తించామని, సంతకాలు తమవి కాదని ప్రతిపాదకులు అఫిడవిట్లలో తెలిపారని రిటర్నింగ్ అధికారి సౌరభ్ పర్ధి తెలిపారు.

బీజేపీకి జాట్‌ల సెగ

తమను చిన్నచూపు చూస్తున్నారని ఆగ్రహం

రాజస్థాన్ సహా పలు రాష్ట్రాల్లో గెలుపుపై ప్రభావం

జైపూర్, ఏప్రిల్ 21: బీజేపీపై జాట్ వర్గం ఆగ్రహంతో ఉన్నది. లోక్‌సభ ఎన్నికల్లో రాజస్థాన్‌తో పాటు పలు ఇతర రాష్ట్రాల్లో కమలం పార్టీకి ఇది నష్టం చేకూర్చే అవకాశం ఉన్నది. ముఖ్యంగా కేంద్ర మంత్రి షెకావత్‌కు పట్టున్న పార్లమెంట్ నియోజకవర్గాలైన జుంజును, చురు, శీకర్, నాగౌర్‌లలో కమలం పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలేలా ఉందని భావిస్తున్నారు. వారి కోపం బీజేపీ సొంతంగా ఈ ఎన్నికల్లో 370 సీట్లను సాధించాలన్న లక్ష్యానికి గండికొట్టేలా కనిపిస్తున్నది. బీజేపీపై ఆగ్రహానికి రాజస్థాన్ ఎన్నికల్లోనే బీజం పడింది. అధికార స్థానాల నుంచి తమను తప్పించడమే కాక, తమను చిన్నచూపు చూస్తున్నారని జాట్‌లు భావిస్తున్నారు. ఇప్పుడు మోదీ ప్రభుత్వంపై పగ తీర్చుకునే సమయం వచ్చిందని వారు భావిస్తున్నారు. జాట్లలోని అసంతృప్తి కేవలం రాజస్థాన్‌కే పరిమితం కాలేదని, వారు అధికంగా ఉన్న హర్యానా, పశ్చిమ యూపీ, ఢిల్లీలలో కూడా ఉందని అఖిల భారత జాట్ ఆరక్షన్ సంఘర్ష్ సమతి అధ్యక్షుడు యశ్‌పాల్ మాలిక్ తెలిపారు.

జాట్ల ఆగ్రహానికి కారణాలేంటి?

రైతుల ఆందోళన

మోదీ ప్రభుత్వంపై జాట్‌ల ఆగ్రహానికి రైతుల ఆందోళన, అగ్నిపథ్ పథకాలు, రాజకీయ వివక్ష ప్రధాన కారణాలుగా కన్పిస్తున్నాయి. పలు డిమాండ్లతో 2020–21లో ప్రారంభమైన రైతుల ఉద్యమంలో పంజాబ్‌లోని జాట్ సిక్కు రైతులు, హర్యానా, పశ్చిమ యూపీ, రాజస్థాన్‌లోని జాట్ రైతులు పెద్దయెత్తున పాల్గొన్నారు. ఉద్యమంలో 750 మంది రైతులు అసువులు బాసినా కేంద్రం పెద్దగా పట్టించుకోలేదు. వారి కుటుంబాలకు ఎలాంటి పరిహారాన్ని ఇవ్వలేదు. రె